ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 60 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం 31 మార్చి 2026 పేజీలు : 04 వెల : 02

# పేదింటి పండుగ



- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల పంపిణీ
- 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు : సీఎం
- పేదల కంట్లో సంతోషమే నా సంకల్పం : సీఎం చంద్రబాబు
- కూటమి వచ్చాక రెండోసారి ఇళ్ల పంపిణీ
- రెండు విడతల్లో కలిపి ఐదు లక్షల పైనే..
- జగన్ ఐదేళ్లలో ఇచ్చింది 6 లక్షల ఇళ్లే
- పేదలకు గూడు కాదు.. గోడు మిగిల్చారు
- విశాఖలో ప్యాలెస్ కట్టుకున్నోళ్లు పేదలకు ఇళ్లు ఇవ్వలేకపోయారా?
- అందుకే ప్రతిపక్ష హోదా కూడా రాలేదు
- అప్పులు గాడిలో పెట్టాం..అభివృద్ధి వైపు ఏపీ
- నాయుడుపేటలోని పుదూరు వద్ద టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవంలో చంద్రబాబు వెల్లడి
- 2,50,893 ఇళ్లు లబ్దిదారులకు అప్పగింత
- ఈ ఏడాది డిసెంబర్‌లోపు మరో 4.5 లక్షల ఇళ్లు
- సంక్షేమంలో మర్చిపోలేని మాసంగా మార్చి
- విశాఖలో ప్యాలస్ కట్టుకున్న వ్యక్తి పేదలకు ఇళ్లు కట్టలేదు
- మన జలాల్లోకి పొరుగు రాష్ట్రాల జాలర్లు రాకుండా కట్టడి
- తిరుపతి జిల్లా నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- లబ్దిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి

ఈ ఏడాది చివరి నాటికి మరో 4.5 లక్షల గృహాలను పేదవారికి నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ ఏడాది జూన్, సెప్టెంబరు మాసాల్లో గృహ ప్రవేశాలు చేసేలా లబ్దిదారులకు ఇళ్లు ఇస్తామని వెల్లడించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 21 నెలల్లో ఇప్పటి వరకూ 5.5 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని వివరించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30కి పైగా చోట్ల నిర్మించిన 2,50,983 టిడ్కో, పీఎంఏవై ఇళ్లను లబ్దిదారులకు అప్పగించారు. తాను హాజరైన ఒక్క తిరుపతి జిల్లాలోనే 15,659 ఇళ్లను నిర్మించి ఇచ్చామని సీఎం వివరించారు. నాయుడుపేటలోని పుదూరు వద్ద జీ ప్లస్ 3 తరహాలో నిర్మించిన భవన సముదాయాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. పార్కులు, వాకింగ్ ట్రాక్, విశాలమైన రహదారులు, అంగన్‌వాడీ, స్కూలు తదితర సదుపాయాలతో నిర్మించిన ఈ టిడ్కో భవనాలను ప్రారంభించిన అనంతరం లబ్దిదారుల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. హైందవ సంప్రదాయ ప్రకారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం మరో ముస్లిం లబ్దిదారు నివాసంలోనూ ప్రార్ధనలు నిర్వహించి నూతన గృహంలో అడుగుపెట్టారు.



## లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నారాయణ

- భారీగా ఆయుధ డంప్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- అందుకే దేశ వ్యాప్తంగా పార్టీ కనుమరుగైంది
- నారాయణతో పాటు లొంగిపోయిన స్పెషల్ జోనల్ కమిటీ, డివిజినల్, ఏరియా కమిటీలకు చెందిన మరో 8 మంది మావోయిస్టులు
- మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధ డంప్ స్వాధీనం

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి చెన్నూరు నారాయణ రావు అలియాస్ సోమన్న ఏపీ పోలీసుల ఎదుట ఈరోజు లొంగిపోయారు. నారాయణతో పాటు స్పెషల్ జోనల్ కమిటీ, డివిజినల్, ఏరియా కమిటీలకు చెందిన మరో 8 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

## బెంగాల్ దీదీకి 'సరిహద్దు' సెగ

- అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా మారిన చొరబాట్లు
- హిందువుల ఓట్లను సంఘటితం చేస్తున్న బీజేపీ
- సీఏఏ అమలు, 'మతువా'ల పౌరసత్వంపై కమలనాథుల ఆశలు
- సంక్షేమ పథకాలు, మైనార్టీ ఓట్ల ఏకీకరణను నమ్ముకుంటున్న మమతా బెనర్జీ
- చొరబాట్లు కేంద్రం వైఫల్యమే.. !
- 'మతువా'ల చుట్టూ రాజకీయ చదరంగం
- సరిహద్దు జిల్లాల్లో పెరిగిన ముస్లిం జనాభా
- పెండింగ్‌లో 40 లక్షల ఎస్ఐఆర్ కేసులు



## నక్సల్స్ విముక్త భారత్!

- దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది
- 75 ఏండ్లు నక్సల్స్‌ను పెంచి పోషించింది కాంగ్రెస్ పార్టీనే
- అడవి బిడ్డలను అభివృద్ధికి దూరం చేసింది నక్సలైట్లే
- ఆయుధాలు చేత పట్టి పోరాడితే భారీ మూల్యం చెల్లించక తప్పదు
- లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సుదీర్ఘ ప్రకటన
- 4800 మంది లొంగుబాటు
- జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వంపై విమర్శలు





# స్టాలిన్, విజయ్ నామినేషన్లు దాఖలు

- తమిళనాడులో నామినేషన్ల ప్రక్రియ షురూ
- 2న ఈరోడ్‌లో స్టాలిన్ ప్రచారం
- డీఎంకే సంక్షేమ పథకాలు సామాజిక పెట్టుబడులు : కనిమొళి
- రెండో దశకు చేరుకున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు
- సోమవారం నుంచి ప్రారంభమయిన నామినేషన్ల ప్రక్రియ
- ఏప్రిల్ 23న జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం ఎలక్షన్ కమిషన్ సోమవారం అధికారిక నోటిఫికేషన్‌ను జారీ
- నోటిఫికేషన్‌ను ప్రభుత్వ గెజిట్‌లో వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అర్చన పట్నాయక్ తమిళనాడు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు రెండో దశకు చేరుకున్నాయి. రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమయింది. ఏప్రిల్ 23న జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం ఎలక్షన్ కమిషన్ సోమవారం అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అర్చన పట్నాయక్ తమిళనాడు ప్రభుత్వ గెజిట్‌లో వెల్లడించారు. ఈ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సోమవారం ఉదయం 11 గంటల నుంచే తమ నామినేషన్లను దాఖలు చేసుకోవడానికి అవకాశం లభించింది.

## 1 నుంచి జనగణన..!

- మొదటి విడతలో గృహ గణన
- 33 ప్రశ్నలతో వివరాల సేకరణ
- తెలంగాణలో మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటి సర్వే
- ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు 'సెల్ఫ్-ఎన్యుమరేషన్'కు అవకాశం
- తెలంగాణలో ఏప్రిల్ 26 నుంచి జనగణన
- సహజీవన జంటలకు కుటుంబ హోదా

## ఖర్గ్‌పైనే గురి..!

- ఇరాన్‌కు ఆర్థిక జీవనాడి అయిన కీలక ద్వీపంపై దాడులకు అమెరికా సన్నాహాలు
- ట్రంప్ ఆదేశాల కోసం పెంటగాన్ నిరీక్షణ
- రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా పశ్చిమాసియాకు అమెరికా బలగాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వర్ణించినట్లు ఇరాన్‌లో చిన్న విహార యాత్రగా ప్రారంభమై ఆ దేశాన్ని పూర్తిగా ఆక్రమించుకునేందుకు ఇప్పుడు పరిస్థితులు దారితీస్తున్నాయి. ఇరాన్‌కు అత్యంత కీలకమైన చమురు ఎగుమతి కేంద్రంగా ఉన్న ఖర్గ్ ద్వీపాన్ని చేజిక్కించుకోవడం సహా ఆ దేశంపై విస్తృతమైన సైనిక దాడులను చేపట్టనున్నట్లు అమెరికా అధికారులు సూచనలు చేశారు. పశ్చిమాసియాకు వేలాదిమంది అమెరికన్ బలగాలను తరలించడంతోసహా ఇరాన్‌ను చావు దెబ్బ కొట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు గత వారాంతంలో అమెరికా అధికారులు సూచనప్రాయంగా తెలిపారు.

# పేదింటి పండుగ

ఇంటి వెలుపల మహిళా లబ్దిదారు పేరిట ఏర్పాటు చేసిన నేమ్ బోర్డును కూడా ముఖ్యమంత్రి స్వయంగా తగిలించారు. ప్రతీ ఇంటిపైనా పీఎం సూర్యఘర్ కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ పొదుపు చేసే ఉపకరణాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈమేరకు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సంస్థతో రాష్ట్రం ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం మరికొందరు లబ్దిదారులకు ఇళ్లకు సంబంధించిన స్వాధీన పత్రాలను ఇంటి తాళాలను అప్పగించారు. గతంలో పీఏఎవై కింద కేంద్రం ఇచ్చిన డబ్బులను కూడా గత పాలకులు దుర్వినియోగం చేశారని సీఎం ఆక్షేపించారు. గత ప్రభుత్వం రూ.816 కోట్ల మేర అప్పు పెట్టిందని.. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టేందుకు ప్రయత్నించిందన్నారు. పేదలు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి కల్పించిందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు.

**సంక్షేమంలో మార్చినెల కొత్త రికార్డులు**

గడచిన 21 నెలల్లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని ..ఈ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ఆదాయం-వ్యయం ఎలా ఉన్నా... సంక్షేమానికి, అభివృద్ధికి మాత్రం లోటు లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్లకు ఇప్పటికి దాదాపు రూ.60 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. తల్లికి వందనం, దీపం 2, స్త్రీశక్తి సహా ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించామన్నారు. ఈ మార్చి నెల సంక్షేమంలో కొత్త రికార్డులు సృష్టించింది. వరాలను తెచ్చిందన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం రోజు లక్ష మంది పారిశ్రామిక వేత్తలుగా ప్రకటించామని.. ఈ ఏడాది 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని పెట్టుకున్నామని స్పష్టం చేశారు. రైతుకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులను విడుదల చేశామని.. 47 లక్షల మంది రైతులకు రూ. 2,676 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు. ఉగాది కానుకగా నిరుద్యోగ యువత కోసం 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చామని అన్నారు. దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్‌కు నెల్లూరు జిల్లాలో శంకుస్థాపన చేసుకున్నామని.. రక్షణ రంగంలో మన రాష్ట్రం కీలకం అవుతుందన్నారు. వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. 12.76 లక్షల మంది దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి' పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా ఈ నెలలోనే కల్పించామని సీఎం తెలిపారు. ఉగాది రోజున 6,787 మంది పేదలకు రూ. 56 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదల చేశామన్నారు. రంజాన్ తోఫాగా ఇమామ్, మౌజన్లకు రూ. 45 కోట్ల గౌరవ వేతనాలు చెల్లించామని స్పష్టం చేశారు. పోలవరం నిర్వాసితులకు రూ.226 కోట్ల పునరావాస నిధులను విడుదల చేశామన్నారు. అన్నింటికీ మించి రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలకమైన ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామని.. ఈ పరిశ్రమ ద్వారా రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, లక్ష ఉద్యోగాలు ఒకే ఒక్క పరిశ్రమతో మనకు దక్కాయన్నారు. గత ప్రభుత్వం చిన్న కాంట్రాక్టర్లకు నిలిపివేసిన రూ.2,000 కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసి 50 వేల కుటుంబాల్లో ఆనందాన్ని తీసుకువచ్చామని తెలిపారు. అంతకుమించి . 5 కోట్ల ప్రజల కలలు నెరవేర్చే ప్రజా రాజధానికి చట్టబద్ధత కల్పించమని కేంద్రాన్ని కోరుతూ శాసన సభలో తీర్మానం చేశామన్నారు.

**2029 నాటికి 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం**

2029 నాటికి రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మొత్తం 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. 2014-19లో 8.19 లక్షల ఇళ్లకు శ్రీకారం చుట్టి పేదలకు అప్పగించామని వివరించారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ అస్తవ్యస్తం చేశారని వాటన్నిటినీ గాడిలో పెడుతున్నామన్నారు. గత పాలకులు పేదవాళ్ల పొట్టకొట్టారని.. వారికి తీరని అన్యాయం చేశార్ని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 6.5 లక్షల ఇళ్లు మాత్రమే కడితే 21 నెలల్లోనే తాము 5.5 లక్షల ఇళ్లను కట్టి పేదవాళ్లకు అప్పగించామన్నారు. గత పాలకులు ప్రజావేదికతో విధ్వంసాన్ని మొదలు పెట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రూ.10.50 లక్షల కోట్ల అప్పులు చేసి.. కేంద్రం ఇచ్చిన డబ్బులు కూడా మళ్లించారన్నారు. అవినీతి, అక్రమాలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సీఎం ఆక్షేపించారు. ఇళ్ల కోసం లబ్దిదారులు కట్టిన రూ.174 కోట్లను కూడా వాడేసుకున్నారని అన్నారు. 22 వేల మంది లబ్దిదారులకు ఆ డబ్బులను తక్షణమే చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. 300 చదరపు అడుగుల ఇల్లు ఉచితమని, 350,400 చదరపు అడుగుల ఇళ్లు రాయితీపై ఇస్తామని ప్రగల్భాలు పలికి మోసం చేశారన్నారు. నివాస యోగ్యం కాని స్థలాలను ఇచ్చి ఇళ్లు కట్టించే ప్రయత్నం చేసి రూ.3,109 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని సీఎం వ్యాఖ్యానించారు. శ్మశానాల్లో, వాగుల్లో, బురద నేలల్లో స్థలాలు ఇచ్చి ఎవరికీ ఉపయోగపడకుండా చేశారన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ పేదలు మురికివాడలు కాకుండా పరిశుభ్రమైన ప్రాంతాల్లో ఉండాలన్న లక్ష్యంతో అన్ని సదుపాయాలతో ఇళ్లను నిర్మిస్తున్నట్టు వివరించారు. విశాఖలో ప్యాలస్ కట్టుకున్న వ్యక్తి పేదలకు ఇళ్లు కట్టడానికి మీనమేషాలు లెక్కించారన్నారు.

**ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు**

అందరికీ ఇళ్లు కార్యక్రమం కింద రాష్ట్రంలో పేదలకు ఉచితంగా ఇళ్లస్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి వివరించారు. భవిష్యత్తులో ప్రతీ ఇంటికీ పైపు ద్వారా గ్యాస్ సరఫరా చేస్తామన్నారు. ఉచిత సిలెండర్ కు ఇచ్చే డబ్బులు ప్రతీ రెండు నెలలకూ వినియోగదారులకు చెల్లిస్తామన్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని కూడా గత పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. కేంద్రాన్ని ఒప్పించి 2028 వరకూ ఈ పథకం కొనసాగించేలా చేశామన్నారు. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజన కూడా జరుగుతుందని.. మహిళలకూ చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే మహిళలకు టీడీపీ, ఎన్డీఏలు స్వాగతం పలుకుతాయన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతోనే అనునిత్యం పనిచేస్తున్నామని సీఎం వివరించారు. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు వచ్చేలా వ్యవస్థను గాడిలో పెట్టామన్నారు. పెన్షన్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పౌర సేవల అమలులో ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. పౌర సేవలు అందించటంలో చక్కగా పనిచేస్తున్న ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నట్టు వివరించారు. సేవలు సరిగ్గా అందని చోట సరిచేసుకోవాలని సీఎం హెచ్చరించారు. ఏప్రిల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని సీఎం స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయాన్ని అనుసరించే పాలన మెరుగు పర్చుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఓటేసి కూటమికి అధికారం ఇచ్చారని.. కానీ ఒకాయన ప్రతిపక్ష హోదా ఇమ్మని అడుగుతున్నారని.. ఆ హోదా ఇచ్చేది ప్రజలే కానీ తాను కాదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు ప్రజలకు మేలు చేయాలని కానీ విధ్వంసం చేయకూడదన్నారు. అలాంటి వారిని దూరం పెట్టాల్సిన అవసరముందన్నారు. 2028 నాటికి తాను రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టి 50 ఏళ్లు పూర్తి అవుతుందని.. ఎలాంటి ఆరోపణలూ లేని తనపై కేసులు పెట్టి జైల్లో వేశారని ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని సీఎం ప్రశ్నించారు. ఇంకా కొందరు సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెట్టి ఆడబిడ్డలను రోడ్డుపైకి లాగుతున్నారని.. దీనిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ముఖ్యమంత్రి బాగా పనిచేస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని గత పాలకుడు ఏపీని గంజాయికి, డ్రగ్స్ కు అడ్డాగా మార్చారన్నారు. కూటమి ప్రజాప్రభుత్వం అనునిత్యం రాష్ట్రంలో సంపద సృష్టికే ప్రయత్నిస్తోందన్నారు. సమర్ధవంతమైన నిర్వహణతో సంక్షేమం అభివృద్ధి సమతూకంగా చేపడుతున్నామన్నారు.

**మత్స్యకారులకు అండగా ప్రజాప్రభుత్వం**

అటానమస్ షిప్ యార్డు వల్ల స్థానిక మత్స్యకారులు ఎవరికీ అన్యాయం జరగదని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పొరుగు రాష్ట్రాల జాలర్లు మన జలాల్లోకి రానివ్వకుండా కట్టడి చేస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు తీరప్రాంతానికి ప్రత్యేకంగా రెండు గస్తీ బోట్లను మంజూరు చేస్తున్నట్టు వివరించారు. పొరుగు రాష్ట్రాల జాలర్ల కారణంగా స్థానిక మత్స్యకారులకు ఎలాంటి నష్టం జరక్కుండా చూడాల్సిన బాధ్యతను తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి అప్పగించారు. తమిళనాడు, పాండిచ్చేరి నుంచి వచ్చిన జాలర్లు ఈ ప్రాంతంలో చేపల వేట చేసుకోడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. అవసరం మేరకు మరో 4 బోట్లను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో జాలర్లకు ఇచ్చే భృతిని మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేలకు పెంచామని.. దీని కోసం 1.29 లక్షల మంది కుటుంబాల ఖాతాల్లో రూ.259 కోట్లు జమ చేశామన్నారు. ఇక మత్స్యకారుల పొట్టకొడుతూ గత ప్రభుత్వం తెచ్చిన 217 జీవోను కూడా రద్దు చేసి స్థానిక నీటి వనరుల్లో జాలర్లకే వేట అనుమతిని పునరుద్ధరించామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, కొలుసు పార్థసారధి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నారాయణ

మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధ డంప్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టు నారాయణ మాట్లాడుతూ.. గతంలో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయని చెప్పారు. దేశంలో మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. సాయుధ పోరాటాన్ని వదిలి.. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని తాను లొంగిపోయినట్లు నారాయణ చెప్పుకొచ్చారు. '1990లో ఉద్దానంలో ప్రజా ఉద్యమానికి ఆకర్షితులు అయ్యాను. అప్పుడే మావోయిస్టు పార్టీలో చేరాను. పార్టీ తీర్మానాలకు అనుకూలంగా పనిచేశాను. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో పనిచేశాను. నేను మావోయిస్టు ఉద్యమాల్లో చేరినపుడు పరిస్థితులు, ఇప్పుడు చాలా మారాయి. మేం పనిచేసిన ఆదివాసీ అటవీ ప్రాంతంలో అనేక మార్పులు వచ్చాయి. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందిస్తోంది. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా పార్టీ అప్డేట్ అవకపోవటమే ఈ వైఫల్యానికి కారణం. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా పార్టీ నిర్ణయాలు తీసుకోవటంతో ఈ పరిస్థితి వచ్చింది. మావోయిస్టు పార్టీ పరిస్థితులకు అనుగుణంగా అప్డేట్ అవలేదు, అందుకే ఏవోబీ సహా దేశ వ్యాప్తంగా పార్టీ కనుమరుగు అయింది' అని నారాయణ వివరించారు. 'సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ సిద్ధాంతాలు మారలేదు. అందువల్లే పార్టీ ఇలా అయింది. పార్టీ హత్య చేసిన ఘటనల్లో నేను కూడా భాగస్వామి అయ్యాను. అయితే పార్టీ నిర్ణయాల్లో భాగంగా మాత్రమే అవి జరిగాయి. నాకు ఎవరితో వ్యక్తిగత విభేదాలు, శత్రుపుత్వం లేదు. జరిగిన ఘటనకు నేను పశ్చాత్తాపపడుతున్నా' అని మావోయిస్టు నారాయణ చెప్పారు. నారాయణరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం. ఆయన దాదాపు 35 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు. 1990లో పీపుల్స్ వార్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మిలిటరీ ఆపరేషన్స్‌లో దిట్ట అనే పేరు నారాయణకు ఉంది. ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తూ.. పార్టీ ఎదుగుదలకు కృషి చేశారు. ఏపీ, ఒడిశాల్లో అనేక కేసులు ఆయనపై ఉన్నాయి.

## 1 నుంచి జనగణన..!

జనగణన కోసం పౌరులు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని కేంద్రం వెల్లడించింది. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ), జన గణన కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈసారి తొలిసారిగా పౌరులు 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' ద్వారా స్వయంగా తమ సమాచారాన్ని నమోదు చేసుకోవచ్చు. ఇది ఇంటింటి సర్వే ప్రారంభానికి 15 రోజుల ముందు అందుబాటులో ఉంటుంది' అని తెలిపారు. భారత్‌లో నివసిస్తున్న పౌరులకు మాత్రమే 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' ఆప్షన్ వర్తిస్తుందని చెప్పారు. మరికొద్ది రోజుల్లో పలు రాష్ట్రాల్లో ఇంటింటి సర్వే ప్రారంభం కాబోతున్నదని, జనాభా లెక్కల సమయంలో సేకరించే పౌరుల వ్యక్తిగత సమాచారం గోప్యమైందని, ఆర్టీఐ కింద గానీ, కోర్టుల ముందు సాక్ష్యంగా గానీ, మరే ఇతర సంస్థతోనూ పంచుకోరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సారి జన గణనతో పాటు కుల గణన కూడా చేపట్టనున్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా గృహాల జాబితా, గృహ గణన, సెల్ఫ్-ఎన్యూమరేషన్ తేదీలను కేంద్రం విడుదల చేసింది. దీని ప్రకారం తెలంగాణలో 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' ఆప్షన్ 'ఏప్రిల్ 26 నుంచి మే 10' వరకు అందుబాటులో ఉంటుంది. జనాభా లెక్కింపునకు సంబంధించి ఇంటింటి సర్వే 'మే 11 నుంచి జూన్ 9' వరకు నిర్వహిస్తారు. వలసలు, సంతానోత్పత్తి, వృత్తి, విద్య సహా పౌరుల సామాజిక-ఆర్థిక వివరాలను సేకరిస్తారు.

**సహజీవన జంటలకు కుటుంబ హోదా**

నా జీవిత భాగస్వామి తాత్కాలికంగా దూరంగా ఉన్నారు. మమ్మల్ని ఇప్పటికీ దంపతులుగా పరిగణిస్తారా? సహజీవనం చేస్తున్న జంటను వివాహిత జంటగా పరిగణిస్తారా? 16వ జనగణనకు ముందు ప్రభుత్వం ప్రచురించిన తరచుగా అడిగే ప్రశ్నలు(ఎఫ్ఏక్యూలు)లో చేర్చిన కొన్ని ప్రశ్నలు ఇవి. జనగణన ప్రక్రియ సమయంలో ప్రజలు ప్రశ్నలకు సులభంగా జవాబులు ఇవ్వడానికి వీలుగా ఎఫ్ఏక్యూలను స్వీయ గణన పోర్టల్‌లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. స్వీయ గణనను ఎంచుకునే వారి కోసం పోర్టల్ జనాభా లెక్కల గృహాల జాబితా, గృహ గణన(హెచ్ఎల్ఓ), అలాగే జనాభా గణన జరిగినంత కాలం అందుబాటులో ఉంటుంది. ఎఫ్ఏక్యూల ప్రకారం సహజీవనం చేసే జంట తమ సంబంధాన్ని స్థిరమైన బంధంగా భావిస్తే జనాభా లెక్కల కోసం వారిని వివాహిత జంటగా పరిగణిస్తారు.

## నక్సల్స్ విముక్త భారత్!

దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని, మావోయిస్టు హింసాకాండకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ నుంచి నక్సలిజాన్ని తుడిచిపెట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు సమీపిస్తున్న వేళ సోమవారం లోక్‌సభలో అమిత్ షా 90 నిమిషాలపాటు నక్సల్ విముక్త భారత్‌పై ప్రసంగించారు. బస్తర్ ఇప్పుడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నదని, ఈ ఘనత భద్రతా దళాలు, రాష్ట్ర పోలీసులు, స్థానిక గిరిజన సమాజానికే దక్కుతుందని ఆయన తెలిపారు. 'దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ప్రక్రియ మొత్తం అధికారికంగా పూర్తయిన తర్వాత దేశానికి తెలియజేస్తాం. అయితే మన దేశం నక్సల్స్ రహితంగా మారిందని చెప్పగలను' అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను తిరస్కరించి ఆయుధాలు పట్టుకునే వారిని ఉపేక్షించబోమని, అటువంటి వారు మూల్యం చెల్లించాల్సిందేనని ఆయన చెప్పారు. ఏండ్ల తరబడి గిరిజన ప్రజలను చీకట్లో ఉంచారని, తమ సిద్ధాంతాన్ని వ్యాప్తి చేసేందుకు లెఫ్టిస్టులు వారిని తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు. స్వాతంత్ర్యం తర్వాత 60, 75 ఏండ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఆరు దశాబ్దాల పాటు గిరిజనులకు ఇండ్లు, స్కూళ్లు లేదా మొబైల్ టవర్లను కాంగ్రెస్ అందుబాటులోకి తీసుకురాలేదు. కాని ఇప్పుడు మీరేం చేశారని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. 1970వ దశకం నుంచి వీటిని ఎందుకు సాధించలేకపోయారని నక్సలిజాన్ని సమర్థించే వారిని నేను ప్రశ్నిస్తున్నాను అని అమిత్ షా నిలదీశారు. బస్తర్ నుంచి నక్సలిజాన్ని దాదాపు పూర్తిగా నిర్మూలించామని, ప్రతి గ్రామంలో పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో రేషన్ షాపులు ఏర్పాటు చేశామని, ప్రతి తహసీల్ పంచాయత్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

## స్టాలిన్, విజయ్ నామినేషన్లు దాఖలు

సోమవారం ముందుగా వ్యాసర్‌పాడిలోని జిసిసి భవనానికి చేరుకున్న విజయ్ అక్కడ తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి గీతకు సమర్పించారు. కాగా విజయ్ తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేయనున్న సంగతి తెలిసిందే. సోమవారం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థులు తమ నామినేష్లను దాఖలు చేయడానికి ఏప్రిల్ 6 వరకూ గడువు ఉంది. ఏప్రిల్ 7న అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్లను ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకూ గడువు ఉంది. రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నారు.

**2న ఈరోడ్‌లో స్టాలిన్ ప్రచారం**

ఏప్రిల్ 2న ఈరోడ్ జిల్లాలో ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రచారం నిర్వహించనున్నారు. డిఎంకె కూటమి అభ్యర్థుల తరుపున స్టాలిన్ ప్రచారం చేయనున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు చిథోడ్‌లో జరిగే ఎన్నికల బహిరంగ సభలో స్టాలిన్ పాల్గొంటారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లోని అభ్యర్థులకు ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయనున్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు గానూ ఐదు స్థానాల్లో అంటే ఈరోడ్ (వెస్ట్), పెరుందురై, భవానీ, అంతియూర్, గోబిచెట్టిపాళయంల్లో డిఎంకె అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మరో మూడు స్థానాల్లో డిఎంకె మిత్రపక్షాలైన సిపిఐ ( భవానీసాగర్ (ఎస్సి)), కాంగ్రెస్ (ఈరోడ్ (ఈస్ట్)), ఎండిఎంకె (మోడక్కుర్రి) పోటీలో ఉన్నాయి.

## బెంగాల్ దీదీకి 'సరిహద్దు' సెగ

దేశ రాజకీయాల్లో ఎప్పుడూ ఆసక్తి రేపే పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రణరంగాన్ని ఈసారి పొరుగు దేశమైన బంగ్లాదేశ్ పరిణామాలు ప్రభావితం చేస్తున్నాయి. వరుసగా నాలుగోసారి అధికార పీఠాన్ని దక్కించుకోవాలని తహతహలాడుతున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సరిహద్దు అంశాలు తలపోటుగా మారాయి. చొరబాటు అస్త్రాన్ని సంధించి ఎలాగైనా దీదీ కోటలో పాగా వేయాలని బీజేపీ కంకణం కట్టుకుంది. బెంగాల్‌కు బంగ్లాదేశ్‌తో 2,216 కిలోమీటర్ల మేర సుదీర్ఘ సరిహద్దు ఉంది. ఇప్పుడు బెంగాల్ రాజకీయాలకు ఇదే కేంద్ర బిందువుగా మారింది. సరిహద్దు గుండా శరణార్థులు, చొరబాటుదారుల రాక భారీగా పెరిగిందని, ఇది రాష్ట్ర జనాభా ముఖచిత్రాన్ని మార్చేస్తోందంటూ బీజేపీ తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తోంది. జాతీయ భద్రతకు ముప్పు పొంచి ఉందని చెబుతూ హిందువుల ఓట్ల ఏకీకరణకు ప్రయతి?నస్తోంది. మరోవైపు, అధికార తృణమూల్ కాంగ్రెస్ ఈ ఆరోపణలను తిప్పికొడుతోంది. సరిహద్దుల భద్రత చూసుకునే బీఎస్ఎఫ్ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని, చొరబాట్లు జరిగితే అది కేంద్రం వైఫల్యమేనని సీఎం మమతా బెనర్జీ వాదిస్తున్నారు. బంగ్లాదేశ్‌తో ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేస్తూ, చొరబాట్ల పేరుతో బెంగాలీలను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సరిహద్దు జిల్లాల్లో రైతులను ప్రభావితం చేసే 'తీస్తా నదీ జలాల పంపిణీ'వివాదం కూడా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనుంది. బెంగాల్‌లో దాదాపు 17 శాతం ఉన్న దళిత (నామశూద్ర) 'మతువా'సామాజిక వర్గం ఉత్తర 24 పరగణాలు, నదియా లాంటి సరిహద్దు జిల్లాల్లో సుమారు 30 నుంచి 40 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటములను శాసించగలదు. దశాబ్దాల క్రితం బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వీరు భారత పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) కింద అధికారికంగా పౌరసత్వం కల్పిస్తామంటూ బీజేపీ ఇచి?చన హామీ వారిని ఆకర్షిస్తోంది. అయితే, సీఏఏ, ఎన్ఆర్సీలను బెంగాల్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయబోమని టీఎంసీ చెబుతోంది. మతువాలు ఇప్పటికే భారత పౌరులని దీదీ వాదిస్తున్నారు. సీఏఏ బీజేపీకి అస్త్రంగా మారింది. దీదీ మాత్రం సంక్షేమ పథకాలు, మైనారిటీ ఓట్ల ఏకీకరణపై ఆశలు పెట్టుకున్నారు. బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి ఉన్న 7 జిల్లాల్లో ప్రతి ఏటా దాదాపు 5 వేల చొరబాటు కేసులు నమోదవుతున్నాయి. గుర్తించని చొరబాట్లు ఇంకా ఎన్నోరెట్లు ఉంటాయి. సరిహద్దు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా 40 శాతం నుంచి 70 శాతం వరకు పెరిగింది. ముర్షిదాబాద్, మాల్దా జిల్లాల్లో ముస్లిం జనాభా 50 శాతానికిపైగా ఉండగా, దక్షిణ 24 పరగణాలు వంటి జిల్లాల్లో 40 శాతం వరకు ఉంది. అక్రమ చొరబాట్ల వల్లే ముస్లింల జనాభా పెరిగినట్లు బీజేపీ ఆరోపిస్తోంది. ముస్లింలను భయపెట్టే రాజకీయాలు చేస్తున్నారని, బెంగాల్ సంస్కృతి, ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం సాగుతోందని తృణమూల్ కాంగ్రెస్ ఆక్షేపిస్తోంది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా సుమారు 25 లక్షల ఓటర్ల కేసులు పరిష్కారం కాగా, ఇంకా 40 లక్షల కేసులు పరిశీలనలోనే ఉండటం రాజకీయ చర్చకు దారితీసింది. సరిహద్దు జిల్లాలైన ముర్షిదాబాద్‌లో 12 లక్షల కేసులు, మాల్దాలో 8 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. మిగిలిన వివాదాస్పద ఓటర్లలో 20 లక్షల మంది ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాల జిల్లాల్లో ఉన్నారు.

## ఖర్గ్‌పైనే గురి..!

అయితే పూర్తి స్థాయి ఆక్రమణకు సంబంధించిన బలగాల కదలికల గురించి ట్రంప్ ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించనప్పటికీ రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా యుద్ధం జరిగే అవకాశం ఉందన్న ఊహాగానాలు సాగుతున్నాయి. అత్యంత అధునాతనమైన యుద్ధ నౌక యూఎస్ఎస్ ట్రిపోలీ(ఎల్‌హెచ్ఏ-7)లో దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బంది సహా 3,500 మంది అదనపు అమెరికన్ బలగాలు పశ్చిమాసియాలో మోహరించి ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఎల్-35 స్టెల్త్ ఫైటర్లు, ఓస్ప్రే ఎయిర్‌క్రాఫ్ట్‌లతో కూడిన ట్రిపోలీని జపాన్ నుంచి పర్షియల్ గల్ఫ్‌కు సమీపంలో అమెరికా మోహరించింది. 82వ ఎయిర్‌బోర్న్ డివిజన్‌కు చెందిన బలగాలు ఇప్పటికే పశ్చిమాసియాలో ఉండగా అదనంగా మరో 10,000 బలగాలను అక్కడ మోహరించే విషయాన్ని అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం(పెంటగాన్) యోచిస్తున్నది. గరిష్ఠ స్థాయిలో ప్రత్యామ్నాయ వ్యవస్థలను మోహరించేందుకు యూఎస్ఎస్ బాక్సర్(ఎల్‌హెచ్‌డీ-4)తోసహా శక్తివంతమైన యుద్ధనౌకలను అక్కడకు తరలిస్తున్నది. భూతల బలగాలు లేకుండానే తమ లక్ష్యాలను సాధించనున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ అన్ని రకాల అవకాశాలను పరిశీలిస్తారని ఆయన చెప్పారు. కమాండర్ ఇన్ చీఫ్ ఆలోచనలకు అనుగుణంగా అన్ని రకాల సన్నాహాలు చేయాల్సిన బాధ్యత పెంటగాన్‌కు ఉందని ఆయన చెప్పారు. గరిష్ఠ స్థాయిలో ప్రత్యామ్నాయాలు ఉంటాయని వైట్ హౌస్ మహిళా ప్రతినిధి కరోలిన్ తెలిపారు. అయితే తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని ఆమె వివరించారు.

## ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

**ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు**
**సన్నబియ్యానికి రూ.14,560 కోట్లు ఖర్చు**
**86 శాతం మందికి పంపిణీ చేశాం**
**డీలిమిటేషన్‌తో నియంత పాలన వస్తుంది**
**దీనిపై హైదరాబాద్‌లో ఇండియా కూటమి భేటీ ఏర్పాటు చేస్తాం**
**పాత్రికేయులతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి**



రాష్ట్రంలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈగల్, హైడ్రా తరహాలో అది పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం పాత్రికేయులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆహార కల్తీ నియంత్రణకు దేశంలోని అన్ని చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని తెలిపారు. పంటలకు ధర నిర్ణయించే అవకాశం రైతులకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకొచ్చినట్టు గుర్తు చేశారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ చేయటమనేది హత్యానేరం కంటే ఎక్కువని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించామని తెలిపారు. అందువల్లే సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, ఈ ప్రక్రియకు ఏడాది పూర్తయిందని గుర్తు చేశారు. తద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం 86 శాతం మంది ప్రజలు, అంటే 3.36 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని వివరించారు. భవిష్యత్‌లో ఇది 90 శాతం కూడా కావచ్చని చెప్పారు. రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా 40 ఏండ్లుగా దొడ్డు బియ్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు వాటి స్థానంలో సన్న బియ్యం ఇస్తుండటంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని వివరించారు. రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇచ్చామని పేర్కొన్నారు.

# ఆర్భాటం వద్దు

గంజినీళ్లు తాగినా పర్వాలేదు
ఉన్నదాంట్లో సర్దుకుపోదాం
హంగు ఆర్భాటాలు వద్దు
సర్దుకుపోవడమే ముద్దు
మనిషికి మించిన స్థాయి వద్దు
లేనిపోని గొప్పలు అసలు పోవద్దు
పెళ్లి కోసం అప్పులు తీసుకోవద్దు
జనం వస్తారు అక్షింతలు వేస్తారు
తింటారు వెంటనే వెళ్లిపోతారు
కానీ... నువ్వు పెళ్ళికి చేసిన
అప్పులు మీతోనే ఉంటాయ్
పెళ్లి అనేది ఒక్కరోజు
కొన్ని గంటలే ఉంటుంది
ఇ.ఎం.ఐ. లు మాత్రం
సంవత్సరం పొడవునా ఉంటాయి
పెళ్లి చూపించడానికి కాదు
కలిసి జీవించడానికి
మీరు స్తోమతకు తగ్గట్టే
మీరు చేయగలిగినదే చేయండి
అప్పులు చేసి లేనిపోని
తిప్పులు తెచ్చుకోవద్దు.



రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

## పెరుమాళ్ళపాడు లో వైభవంగా సోమవారం శ్రీ రాముల వారికి అభిషేకం పట్టాభిషేకం గ్రామోత్సవ సంబరాలు



**సైదాపురం, విజ్ఞాన్ దినపత్రిక మార్చి 30** సైదాపురం మండలం లో పెరుమాళ్ళ పాడు లో శ్రీరామ నవమి ఉత్సవాలు లో బాగంగా సోమవారం నాలుగవ రోజు రాముల వారికి అభిషేకం పట్టాభిషేకం గ్రామోత్సవ సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ ఉభయ కర్తలు తెలిపారు. సాయంత్రం పట్టాభిషేకం మంగళ వాయిద్యాలు నవరంజీ మేళాల తో స్వామి వార్ల గ్రామోత్సవం, కూచిపూడి, భరత నాట్యం, చిన్న పిల్లల తో డ్యాన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు జరుప బడుతున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు గ్రామం లో అందరూ ఒక్క చోట చేరి ఒకటి గా ఆనందంగా ఉత్సాహంగా భక్తి శ్రద్ధలతో శ్రీ రామ నవమి కి రాములోరి కి ఎలాంటి లోటు లేకుండా జరుకుంటామని ఉభయ కర్తలు తెలిపారు. ఈ ఏడాది ఎస్ వి మైనింగ్ మోహన్ రాజు శ్రీ రాముల వారి గుడికి 80 వేలు రూపాయలు తో గుడి ప్రాంగణం లో స్వామి వారి గుడి చుట్టూ రేకుల ను ఏర్పాటు చేయించారని మోహన్ రాజు వారి తనయుడు ను ఆహ్వానించి పూర్ణ కుంభం తో స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా దుశ్శాలువా తో సత్కరించి ఎస్ వి మైనింగ్ అదినేత మోహన్ రాజు ఆయన తనయుడికి ఉభయ కర్తలు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. పట్టాభిషేకం సాంస్కృతిక కార్యక్రమాలు చుట్టూ పక్కల గ్రామాల కు దీటుగా కుగ్రామ మైన పెరుమాళ్ళపాడు లో వైభవంగా వివిధ ప్రాంతాల లో స్థిర పడ్డ ఈ గ్రామ వాసులు యువకులు తో ఉ భయకర్తలు కలిసి వేడుకగా నిర్వహిస్తున్నారు.

## ధాన్యం రైతులు తేమ వలన నష్టపోకుండా శాశ్వత పరిష్కారంగా మొబైల్ పాడి డ్రయ్యేర్లు అందుబాటులోకి తేవాలి.

**నెల్లూరు.. మార్చ్ 30/(విజ్ఞాన్ ప్రతినిధి)** నెల్లూరు జిల్లాలో ధాన్యం ధరలు పతనం కు గల కారణాలను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు బిజెపి నేతలు వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తేమ పేరుతో పుట్టికి 120 కేజీలు మిల్లర్లు అదనంగా తీసుకుంటున్నారని మూడు వారాలకు ముందు జిల్లాలో అన్ని రకాల ధాన్యానికి బహిరంగ మార్కెట్లో మద్దతు ధర లభించిందని నేడు ఆ ధరలు పతనమయ్యాయని బిజెపి నేత మిడతల రమేష్ మంత్రికినాదెండ్ల మనోహర్ కీ వివరించారు..సోమవారం మినిర్వ గ్రాండ్ ఆయన మంత్రి ని కలిసి జిల్లాలో ధాన్యం రైతుల ఇబ్బంది పడుతున్న రని ధాన్యం నేడు పుట్టి నాలుగు వేల నష్టానికి రైతుల విక్రయించుకుంటున్నారని రైతుల కొనుగోలు కేంద్రాలకు వద్దకు వెళితే అక్కడ గోని సంచులు ఉ ండవు. లారీలు దొరకవు. కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు పోయిన ధాన్యాన్ని దించడానికి ఒక వారం రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్ని మంత్రి కీ తెలియజేసారు. అందువల్లనే రైతుల బ్రోకర్లను ఆశ్రయించి ధాన్యాన్ని నష్టాలకు అమ్ముకుంటున్నారని చెప్పారు. మిల్లర్లు 65 కోట్ల బ్యాంకు గ్యారంటీలు తీసుకున్న



నామమాత్రంగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం సేకరిస్తున్నారు. సిఎంఆర్ రైస్ కొరకు దాన్యం సేకరిస్తే కరెంటు చార్జర్ గిట్టుబాటు కావడం లేదని బిల్లులు ధాన్యాన్ని సేకరించడం లేదని తేమ పేరుతో రైతులు నష్టపోకుండా శాశ్వత పరిష్కారం కొరకు మొబైల్ పాడీ డ్రయ్యేర్ రైతులు కు సబ్సిడీ తో అందించాలని మంత్రికి రమేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కందికట్ల రాజేశ్వరి. నరాల సుబ్బారెడ్డి. సృజన. విజయ్ .నాగలక్ష్మి. పద్మ. ఏవి సుబ్బయ్య. ఆదినారాయణ. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు

## 2047 నాటికి పేదలందరూ బంగారు కుటుంబాలుగా మారాలి

**-కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి**

**కావలి: విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** నెల్లూరు జిల్లా,కావలి ఆర్డీఓ కార్యాలయంలోౖ4 మొదటి వార్షికోత్సవం మొదటి వార్షికోత్సవం బంగారు కుటుంబాల లక్ష్యంపై సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి హాజరై అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సమగ్రంగా సమావేశం జరిగింది. పేదల సంక్షేమం, వారి జీవన ప్రమాణాల మెరుగుదలపై ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా సమీక్షించారు. అనంతరం 8 మంది మార్గదర్శకులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కుటుంబాలను దత్తత తీసుకునేందుకు దాతలు, సేవాభావం ఉ న్న వ్యక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వ సంకల్పం సఫలీకృతం కావాలంటే దాతలు ముందుండి సహకరించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం పేదల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కట్టుబడి ఉందని, విద్య ద్వారానే వారి భవిష్యత్తు మారుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విద్య, ఆరోగ్యం, ఉ పాధి రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. 2047 నాటికి పేదలందరినీ బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు. పేదల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి వర్గం కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో స్పష్టం చేశారు..

## చప్పిడి చిన మాల కొండయ్య ను పరామర్శించిన దారపనేని



**కనిగిరి విజ్ఞాన్ దినపత్రిక :** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని మోపాడు గ్రామ వాస్తవ్యులు చప్పిడి చిన మాల కొండయ్య ను కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పరామర్శించారు. కనిగిరి మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు దివంగత ఇరిగినేని తిరుపతి నాయుడుకు అత్యంత సన్నిహితులైన చప్పిడి చిన్న మాల కొండయ్య అనారోగ్యంతో అస్వస్థత కు గురికావడంతో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని సలహా, సూచనతో విజయవాడ, బెంగుళూరు లోని కార్పొరేట్ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్యం చేయించుకుని స్వగ్రామం మోపాడు లోని చిన మాలకొండయ్య స్వగృహంలో దారపనేని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ విడనాడి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ చప్పిడి రామయ్య, మోపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోరుబోయిన గిడ్డయ్య యాదవ్ ,నుచ్చుపొద తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఫిషర్మెన్ కమిటీ మాజీ అధ్యక్షులు కొలూరి ఖాజా రంతుల్లా, చప్పిడి కొండలరావు తదితరులు చిన మాలకొండయ్యను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## అట్టహాసంగా చిలకపాటి మధు ప్రమాణ స్వీకారం

**-శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నేతలు**
**-ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు తెలిపిన మధు**



**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్)** కందుకూరు పట్టణానికి చెందిన బీసీ నాయకుడు చిలకపాటి మధు... రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా ఈరోజు బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని బిసి భవన్ లో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతి... సభ్యులందరి చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చిలకపాటి మధు మాట్లాడుతూ... తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, యువ నాయకులు నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తనపై ఎంతో నమ్మకంతో ప్రోత్సాహం అందిస్తున్నారని, కందుకూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, బీసీల ఐక్యతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మధు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కి ధన్యవాదాలు తెలియజేశారు. చిలకపాటి మధు ప్రమాణస్వీకారానికి కందుకూరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు తరలి వెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం మధును ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ వడ్డెళ్ళ రవిచంద్ర, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీనివాసరావు, చుండూరి శ్రీను, రావూరి రామకోటయ్య, గొల్లపూడి శ్రీనివాసరావు, షేక్ షరీఫ్, మాదాల రవీంద్ర, పూజల పున్నారావు తదితరులు పాల్గొన్నారు..

## కోవూరులో రైతుల చెంతకే మంత్రి నాదెండ్ల మనోహర్

**– ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చొరవతో ధాన్యం కళ్లాలను స్వయంగా పరిశీలించిన మంత్రి నాదెండ్ల.**
**- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులతో ముఖాముఖి.**
**- 22 శాతం వరకు తేమ ఉన్నా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని భరోసా ఇచ్చారు.**
**- ధాన్యం ఆరబెట్టుకునేందుకై రైతులకు మొబైల్ డ్రైయర్ల అందచేసేందుకు మంత్రి హామి.**
**- గోనె సంచుల సరఫరా, ధాన్యం రవాణా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం.**
**- రైతులకు న్యాయం చేసే విషయంలో ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉంది.**
**- ధాన్య సేకరణలో ఎక్కడా జాప్యం జరగకూడదని, రైతులకు ఇబ్బంది కలిగించవద్దని అధికారులకు ఆదేశాలు.**

రైతన్నను అన్ని విధాలా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి మేరకు కోవూరు మండలంలోని లేగుంటపాడు గ్రామంలోని ధాన్యం కల్లాలను మంత్రి స్వయంగా సందర్శించారు. ?క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమీక్షించిన మంత్రి, రైతులతో నేరుగా మాట్లాడి అధికారుల పనితీరు, మిల్లర్ల సహకారంపై ఆరా తీశారు. ధాన్యం సేకరణలో తాము ఎదుర్కొంటున్న గోనె సంచుల కొరత, ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లాంటి ప్రధాన సమస్యలను రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ ఇకపై ఇకపై గోనె సంచుల కొరత ఉండదని రైతులకు సరిపడా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు తమకు నచ్చిన ఏ మిల్లుకైనా ధాన్యాన్ని తరలించుకోవచ్చని సూచించారు. 22 శాతం వరకు తేమ ఉ న్నా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ధాన్యం ఆరబెట్టుకోవడంలో ఇబ్బందులు కలగకుండా రైతులకు మొబైల్ డ్రైయర్లు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులకు న్యాయం చేసే విషయంలో ప్రభుత్వం పూర్తి చిత్తశు ద్ధితో ఉందని ధాన్య సేకరణలో ఎక్కడా జాప్యం జరగ కూడదని



అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని డెల్టా రైతులు పడుతున్న ఇబ్బందులను మంత్రికి చెప్పగానే ఆయన స్పందించడం సంతోషకరమన్నారు. తన విజ్ఞప్తి మేరకు స్వయంగా కల్లాల వద్దకే వచ్చి రైతులకు ధైర్యం చెప్పిన మంత్రికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్, పౌరసరఫర మరియు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో పాటు స్థానిక తెలుగుదేశం మరియు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు సాయం చేసేందుకు ముందుకు రావాలి ఎమ్మెల్యే ఇంటూరి పిలుపు

**-పేదరిక నిర్మూలన కోసమే పి 4 కార్యక్రమం**
**-సబ్ కలెక్టర్ కార్యాలయంలో పి 4 మొదటి వార్షికోత్సవ వేడుకలు**
**-హాజరైన ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశీ - ముగ్గురు మార్గదర్శులకు సత్కారం**

**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్)** రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలన్న మంచి ఉద్దేశంతో పి 4 (పబ్లిక్ - ప్రైవేట్ - పీపుల్ - పార్ట్ నర్ షిప్) కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పి 4 మొదటి వార్షికోత్సవ వేడుకలను సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించగా... ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశీ అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా సాయం అందుకుంటున్న వారు కాకుండా... వైద్యం, చదువు, ఉపాధి లాంటి తీరని అవసరాలను గుర్తించి, సాయం అందించేందుకు కార్యక్రమం అమలు చేస్తున్నారని చెప్పారు. బయట ప్రాంతాల్లో స్థిరపడి, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు... సొంత ఊరిలో పేదలకు అండగా నిలిచేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యంగా పేద పిల్లల చదువులు, వైద్యం కోసం సాయం అందించాలన్నారు. కందుకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు... సాయం కోరుతున్న 13,591 బంగారు కుటుంబాలను గుర్తించామని ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు. వారికి సాయం అందించేందుకు 545 మంది మార్గదర్శకులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇందులో 3 వేల కుటుంబాలను దత్తత తీసుకునే ప్రక్రియ పూర్తయిందని వివరించారు. మిగిలిన మార్గదర్శులతో



త్వరలోనే సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండలం రాళ్లపాడు గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన దగ్గుమాటి సుబ్బారావు, కందుకూరు ఆర్టీసీ బస్టాండ్ లో 12 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన పిడికిటి వెంకటేశ్వర్లు, ప్రతినెలా 6 కుటుంబాలకు 2 వేల రూపాయల చొప్పున ఆర్థిక భరోసా కల్పిస్తున్న కాకుమాని ప్రవీణ్ కుమార్ లను ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ కలిసి ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కందుకూరు తహసిల్దార్ మురళి, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ అనూష, యంగ్ ప్రొఫెషనల్ అనిల్, నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ సీనియర్ నేత ప్రభాకర్ రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడూరు ప్రభాకర్ రెడ్డి ఆకస్మిక మరణం చెందడం పట్ల కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతి రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కొమరిక గ్రామంలోని ప్రభాకర్ రెడ్డి నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.



# నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా వై తొలుగుతా

-తోటయ్య తో మాట్లాడి చాలా కాలమైంది
-బ్యాంకు ట్రాన్సక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న
-ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయాలి
-రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు




**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** నాలుగు కరైకల్ బోట్లకు సంబంధించి రకరకాల వదంతులు రావడం జరిగినది. లోకేష్ బాబు పర్యటన ముందు రోజు వచ్చి జువ్వలదిన్నె ప్రాంతంలో చూసుకొని తరువాత పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న దానివలన అక్కడికి వెళ్లడం జరిగినది. నేను కానీ మా సోదరుడు మీద రవిచంద్ర గాని సెకండ్ జనరేషన్ వచ్చిన తర్వాత మత్స్యకార గ్రామాలలో ఎటువంటి తగాదాలు లేవు. నేను ఏ పార్టీలో ఉ ండిన చాలా డిస్నేడ్ గా ఉంటాను. ఈ విషయం సోషల్ మీడియాలో తెలిసిన వెంటనే మా ఇసుకపల్లి గ్రామ పెద్దకాపు తోటయ్య బంధించి రకరకాలుగా వాళ్ళ కట్టుబాట్లు ప్రకారం బోట్ల విషయంలో రూపుదిద్దుకున్నది. నేను నేరుగా మీడియా మిత్రుల ద్వారా మచికార సోదరులకు తెలియజేయాలన్నది నా ముఖ్య ఉద్దేశం. కావలి ఎమ్మెల్యే గాని, గ్రామాలకు సంబంధించిన వైసీపీ వారు మరియు టిడిపి వారు ఇద్దరితో కలిసి మీటింగ్ పెట్టడం జరిగినది. నేను ఆ గ్రామాలను నాలుగైదు సార్లు కూడా సందర్శించి మీటింగ్ పెట్టడం జరిగినది. మత్స్యకార గ్రామాల్లో ఎక్కడైనా వివాదాలు వచ్చినా నన్ను పరిష్కరించమని ఆహ్వానిస్తారు. బోట్లు వివాదం గత 40 సంవత్సరాల నుంచి జరుగుతుంది . తమిళనాడు వాళ్లకి చిన్న బోర్డులు ఉంటాయి అవి పులికాట్ సరస్సు మీద మన ఏరియాలోకి ప్రవేశిస్తాయి. పెద్ద బూట్లు కరైకల్ మరియు పాండిచ్చేరి వారికి మాత్రమే ఉ న్నాయి. వారు ఏడు కిలోమీటర్ల అవతల వేట చేయాలి. కానీ వారు మన వద్ద సంపద ఎక్కువగా ఉన్నదని ఇక్కడ వేట చేయడం ఆ తరువాత మన మత్స్యకారులు వారిని పట్టుకుని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో నా ద్వారా కాంగ్రెస్ పార్టీ అయినా కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ద్వారా మధ్యవర్తిత్వం చేసి మన మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించేవారు. ఈసారి వాళ్ల మధ్య సంపదను ధ్వంసం చేస్తున్న దాని వలన ఏ రాజకీయ పార్టీ వారు వచ్చిన వదలకుండా వారి దీనికి పరిష్కారం చూసుకోవాలన్న ఆలోచనలో ఉండినారు. 164 గ్రామాలు ఒక తీర్మానం చేసుకొని ఉండారు కాబట్టి మన దగ్గరికి వస్తే మనం ఏదైనా పరిష్కరించుకునే దానికి ఉంటుంది. నన్ను ఎవరు కూడా సంప్రదించను లేదు, ఎవరి కి కూడా ఫోన్ చేయలేదు. అనవసరంగా తల దూర్చకూడదు. మనల్ని అడిగినప్పుడు మనం మాట్లాడదాము అనుకున్నాను ఈ బోట్లకు సంబంధించి ఎఫ్ఐఆర్ లు కూడా పోలీస్ స్టేషన్లో నమోదు అయి ఉన్నవి. పాండిచ్చేరిలో ఉన్న ప్రభుత్వము బిజెపికి సంబంధించి ఉన్నది. తమిళనాడు ముఖ్యమంత్రి నాతో ఈ సమస్య మీద పరిష్కరించమని చెప్పినట్టు రూమర్లు వచ్చినది ఒకవేళ గౌరవ స్టాలిన్ మాట్లాడాలనుకుంటే డైరెక్ట్ గా గౌరవ చంద్రబాబు నాయుడు తోనే మాట్లాడుతారు. ఎందుకంటే ఒకప్పుడు ఎన్డీఏ గవర్నమెంట్ కన్వీనర్ గా చంద్రబాబునాయుడు ఉన్నప్పుడు డిఎంకె వారు కూటమిలో ఉండినారు. లోకేష్ బాబు వచ్చినప్పుడు ఈ బోట్లు ఎందుకు ఉన్నాయి అని అడిగినట్టు, వాటిని పంపించేసిండి అని చెప్పినట్టు, నేను ఆరోజు రంగ ప్రవేశం చేసినట్టు, జువ్వలదిన్నె కాపుకు, ఇసుకపల్లి కాపుకు, కడలూరు కాపుకు ఒక్కొక్కరికి పది లక్షల రూపాయలు డబ్బులు ఇచ్చినట్టు ఆ తర్వాత అదృష్టం అయిపోయినట్టు ఒక కట్టు కథ అల్లినారు. అది తరువాత తెలుస్తుంది. తమిళనాడు నుంచి వచ్చిన వారు కావలి లాడ్జిలో దిగి ఒక నెల రోజుల నుంచి వాటికి స్థానికుల సహాయంతో రిపేర్లు చేసుకున్నారు. ఇది స్థానికుల సహకారం లేనిదే జరగదు అక్కడ ముగ్గురు పోలీసు వారు కూడా ఉన్నారంట. ఈ మత్స్యకారి గ్రామాలన్నీ కలిసి ఇసుకపల్లి కాపుకి తాళాలు ఇచ్చినారు. ఒక్కొక్క బోటు కి 1500 లీటర్లు డీజిల్ కావాలి. ఇవన్నీ అప్పటికప్పుడుకే జరిగింది కాదు. ఇది అంతర్రాష్ట్ర వివాదం కాబట్టి ముఖ్యమంత్రి శాశ్వత పరిష్కారం కావాలి అని కోరుకుంటున్నాను. హై లెవెల్ కమిషన్ వేసి ఎంక్వయిరీ చేసి నిజాలు తేల్చడం చేయాలి. ప్రభుత్వాలను కూడా ఇరక పెడుతున్నారు కాబట్టి ఈ విషయంలో లోకేష్ బాబు కూడా ఇన్వాల్వ్ చేస్తున్నారు అందుకు గౌరవ ముఖ్యమంత్రి త్వరగా పరిష్కరించాలని కోరుకుంటున్నాను. ఆరోజు రాత్రి మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజిన ఒక కాపీ ఇవ్వడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బిఎంఆర్ కాల్ లిస్ట్ తీస్తే తెలుస్తుంది కదా లేదా బిఎంఆర్ అకౌంట్ చూస్తే తెలుస్తుంది కదా అంటున్నారు. ఇది కొంతమంది రాజకీయ నాయకులు చేస్తున్నారు అది మీ అందరికీ తెలిసిందే. శ్రీరామచంద్రుడి సాక్షిగా చెప్తున్నా ఇయన్నీ అపోహలు. అందుకనే ఒక కమిటీని వేస్తున్నాము కొద్దిగా ఓపిక పట్టండి. ఆ కమిటీలు మత్స్యకారులు కూడా ఉంటారు ఎవరెవరు ఉండాలి అనేది వారు నిర్ణయిస్తారు. దీని మీద కమిటీ వేసి ఇది నీకు తెలుస్తామని తెలుపుకుంటున్నాను.

## జిల్లాలో 197 తాగునీటి పనులకు రూ.103.38 కోట్లు మంజూరు

-జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల
-గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు
-గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షితమైన తాగునీరు



**నెల్లూరు, (విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 30:** జిల్లాలో తాగునీటి ఎద్దడిని పూర్తిగా నివారించేందుకు 197 తాగునీటి పనులకు రూ. 103.38 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డెవలప్‌మెంటు పథకంలో భాగంగా పూర్వోదక స్కీమ్ (జల్‌జీవన్ పథకం) అనుసంధానంతో ఈ నిధులను జిల్లాలోని తాగునీటి పథకాలకు కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న గ్రామాల్లో తాగునీటి పథకాల రిపేర్లు, ఇంటింటికి కుళాయి కనెక్షన్ల ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల రిపేర్లు, నూతన ట్యాంకుల నిర్మాణం, నిరుపయోగంగా ఉన్న సమగ్ర గ్రామీణ నీటి పథకాలను పునరుద్ధరించుటకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు.ప్రతి ఇంటికి కూడా సురక్షితమైన మంచినీటిని అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యంగా కలెక్టర్ చెప్పారు. ఈ పనులన్నింటిని కూడా 2026 డిసెంబరులోగా పూర్తి చేసేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గంలో 36 పనులకు 13.43 కోట్లు, గూడూరు నియోజకవర్గంలో 16 పనులకు 7.44 కోట్లు, కావలి నియోజవర్గంలో 2 పనులకు 14.76 కోట్లు, కోవూరులో 34 పనులకు 22.26 కోట్లు, నెల్లూరు రూరల్ 13 పనులకు 4.11 కోట్లు, సర్వేపల్లి 44 పనులకు 13.26 కోట్లు, ఉదయగిరి 40 పనులకు 23.72 కోట్లు, వెంకటగిరి 12 పనులకు 4.36 కోట్లు మొత్తం 103.38 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ హిమాన్ష్ శుక్ల పేర్కొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వంకు వారదులు ... వార్తా పత్రికలు..!







-పారదర్శక మైన వార్తలు అందిస్తున్న విజ్ఞాన్ దినపత్రిక
-నూతన సంవత్సర డైరీ ని ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**.ఉదయగిరి... విజ్ఞాన్ ప్రతి నిధి** సమాజం లో ఏ మూల ఏమి జరిగిన క్షణంలో ప్రజల కు తెలియజేస్తు ప్రజల కు ప్రభుత్వం కు వారధి గా పత్రిక లు ఉంటాయని అన్నారుఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కుమార్ సోమవారం విజ్ఞాన్ దినపత్రిక ఉగాది వార్షిక డైరీ ని ఆయన తన కార్యాలయం లో ఆవిష్కరించారు.. విజ్ఞాన్ పత్రిక మంచి వార్తలను ప్రచురి స్తునందని సమాజహితం కోసం మెరుగైన సమాచారం అందించాలని విజ్ఞాన్ సంపాదకుడు ఉదయ్ కుమార్ రెడ్డి ని అభినందించారు... ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విజ్ఞాన్ దినపత్రిక ఆర్సి ఇంచార్జ్ ఏసి పోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్లు, రిక్షాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

-స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ద్వారా వాహనాల కేటాయింపు

**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్)** కందుకూరు మండలంలోని 19 పంచాయతీలకు పంపిణీకార్యక్రమం స్వర్ణఆంధ్ర – స్వచ్ఛఆంధ్రకు సహకరించాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా... కందుకూరు మండలంలోని 19 పంచాయతీలకు చెత్తతరలింపు వాహనాలను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలోని మోపాడు, ఓగూరు పంచాయతీలకు.. ఒక్కొక్కటి 8.5 లక్షలు విలువచేసే ట్రాక్టర్లను ఎమ్మెల్యే నాగేశ్వరరావు పంపిణీ చేశారు. అలాగే గ్రామాలలో పారిశు ద్ధ్య నిర్వహణకు వీలుగా 32 రిక్షాలను కూడా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలను పరిశు భ్రంగా మరియు ఆరోగ్యకరంగా మార్చేందుకు స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55 కోట్లతో 93 ట్రాక్టర్లను పంపిణీ చేస్తోందన్నారు. రెండువేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పంచాయతీకి ట్రాక్టర్ ఇస్తున్నారని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 12 వేల రిక్షాలు, 5 వేల తోపుడుబండ్లను అందిస్తోందని ... గ్రామాల్లో చెత్తను సరైన విధానంలో సేకరించేందుకు, అక్కడ నుంచి... చెత్త నుండి సంపద తయారీకేంద్రాలకు తరలించేందుకు, ఈ వాహనాలు ఉ పయోగపడతాయని అన్నారు. ప్రజలంతా రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర



స్వచ్ఛఆంధ్రగా మార్చేందుకు సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు ట్రాక్టర్ ను కొద్దిసేపు సరదాగా నడిపారు. వాహనాలను జాగ్రత్తగా ఉపయోగించాలని, చెత్త సేకరణలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నరిశెట్టివారిపాలెం సర్పంచ్ ముప్పాళ్ళ శ్రీను, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు బొద్దులూరి కొండలరావు, పచ్చవ తిరుపతిస్వామి, భోగినేని వెంకటేశ్వర్లు, రాయపాటి శ్రీను, గొంది నర్సింగరావు, సూరం చిరంజీవిరెడ్డి, నాదెళ్ల మాధవ, వంకదారి శ్రీను, రెబ్బవరపు మాల్యాద్రి, ఈదర నరసయ్య, రావుల రవి, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అల్లూరు రోడ్ ఆర్ ఓ బి పనులు తక్షణం ప్రారంభించాలి

-ఎన్ హెచ్ ఎ ఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌కు లేఖ సమర్పించిన ఎంపీ బీద మస్తాన్‌రావు యాదవ్

**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్) మార్చి 30:** ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలోని అనంతవరం సమీపంలో ఎన్‌హెచ్–16 పై ఉన్న అల్లూరు రోడ్--బిట్రగుంట రైల్వే క్రాసింగ్ (ఎల్‌సీ నెం.144) వద్ద ప్రతిపాదిత రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ ఓ బి) నిర్మాణాన్ని తక్షణం ప్రారంభించాల్సిందిగా రాజ్యసభ సభ్యులు శ్రీ బీద మస్తాన్‌రావు యాదవ్ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ( ఎన్ హెచ్ ఏ ఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్, ఐ ఏ ఎస్ నేరుగా లేఖ సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీ బీద మస్తాన్‌రావు యాదవ్ మాట్లాడుతూ, అల్లూరు రోడ్ రైల్వే గేట్ వద్ద చాలా కాలంగా తీవ్రమైన ట్రాఫిక్ సమస్య నెలకొని ఉ ందన్నారు. కోల్కతా--చెన్నై జాతీయ రహదారి మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఎన్‌హెచ్–16 పై ఈ రైల్వే క్రాసింగ్ ఉ ండటంతో, గేట్ మూసివేసే ప్రతిసారీ వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా స్థానిక ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపార వాహనాలు, అలాగే అత్యవసర సేవల వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు పార్లమెంట్‌లో వచ్చిన సమాధానాల ప్రకారం ఈ ఆర్ ఓ బి ఇప్పటికే మంజూరు కావడంతో పాటు, అలైన్‌మెంట్ ప్లాన్ మరియు జనరల్ అరేంజ్‌మెంట్ డ్రాయింగ్ ( జి ఏ డి) కూడా ఖరారైందని, అయినప్పటికీ ఇప్పటివరకు భౌతిక పనులు ప్రారంభం కాకపోవడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజల



భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, ప్రాంతీయ అభివృద్ధి దృష్ట్యా ఈ ప్రాజెక్టును ఇకపై మరింత ఆలస్యం చేయరాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, ఎన్ హెచ్ ఏ ఐ రైల్వే శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంబంధిత అధికారులతో తక్షణం సమన్వయం చేసి, పెండింగ్‌లో ఉన్న ఫైల్ స్థాయి మరియు విభాగాల మధ్య సమస్యలను పరిష్కరించాలని ఎంపీ కోరారు. అలాగే, పనుల ప్రారంభానికి స్పష్టమైన గడువు నిర్ణయించి, వీలైనంత త్వరగా స్థలంలో భౌతిక పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని ఎన్ హెచ్ ఏ ఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ ని ఆయన అభ్యర్థించారు. అల్లూరు రోడ్ వద్ద ఆర్ ఓ బి నిర్మాణం పూర్తయితే ప్రమాదాలకు గురయ్యే ఈ కీలక ప్రాంతానికి శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, ఎన్‌హెచ్–16 పై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, ప్రజల ప్రాణ భద్రత మెరుగుపడుతుందని బీద మస్తాన్‌రావు యాదవ్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలోని ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ అయిన ఈ ఆర్ ఓ బి పనులను అత్యవసర ప్రజా ప్రయోజన అంశంగా పరిగణించి వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.